క్లుప్తంగా

ఉద్యోగం సాధించిన యువతికి సన్మానం

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లుకు చెందిన కోటకొండ మంజుల గురుకుల పీడీ ఉద్యోగం సాధించడంతో ఆదివారం కేవీపీఎస్ నాయకులు పూలమాల, శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని గొప్ప స్థానాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేష్, చెన్నయ్య, చిరంజీవి, మన్యం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణానికి చెందిన టైలర్ జిందే విశ్వనాథ్ కూతురు జిందే లలిత జూనియర్ లెక్చరర్ గురుకుల, టీజీటీ మ్యాథ్స్ విభాగంలో కొలువు సాధించారు. ఆదివారం పట్టణ ప్రముఖులు ఆమెను అభినందించారు. రోజూ 16 గంటలు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించానని ఆమె పేర్కొన్నారు.

అడ్డగోలు చేరికలను ప్రోత్సహించొద్దు



పెబ్బేరు రూరల్: కాంగ్రెస్లోకి అడ్డగోలు చేరికలను ప్రోత్సహించరాదని మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, గంధం రాజశేఖర్, వెంకటరమణ అన్నారు. వారు స్థానిక నాయకులతో కలిసి ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి జిల్లాలో పరిణామాలు గమనిస్తే ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్లోకి చేర్చుకోవడం శోచనీయమన్నారు. పార్టీ పదేళ్ల కాలంలో ఎంతో కష్టపడిన కార్యకర్తల వల్ల అధికారంలోకి వచ్చిందని, ఎన్నో కేసులను అవమానాలను భరించారన్నారు. కార్యక్రమంలో దూపం సర్వేష్, జగదీశ్వర్రెడ్డి, జీఎస్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో కలియుగ వైకుంఠ హరిహర అయ్యప్ప క్షేత్రంలో ఆదివారం శివమాలధారులు ఇరుముడి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం శివనామస్మరణంతో మార్మోగింది. ఇరుముడి ధరించిన వారికి కుటుంబ సభ్యులు మేళతాళాలతో ఊరేగింపుగా సాగనంపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్కు చెందిన గంధం ఊషన్న మృతిచెందడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు చీర్ల విజయ్, జయనందం, వెంకటేష్, మన్నెంకొండ పలువురు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి పంపిన రూ.5వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని వెంకటాపురం చెందిన గొల్ల చెన్నయ్య మృతి చెందడంతో జిల్లెల ఆదిత్యారెడ్డి రూ.4వేల ఆర్థికసాయం అందించారు.

రెడ్డి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



వనపర్తిటౌన్: రెడ్డి విద్యార్థులు చదువు, రాజకీయ, వైద్య, పారిశ్రామికరంగాల్లో రాణించాలని రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి రెడ్డి బంధువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉన్నత హోదాల్లో స్థిరపడ్డ వారు సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు పలు సూచనలు చేశారు. పేద రెడ్డి పిల్లలను విద్య, వైద్యపరంగా, ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.

లక్ష్యం నిర్దేశించుకుని చదవాలి



వనపర్తిటౌన్: విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని రాక్వుడ్స్ విద్యాసంస్థల చైర్మన్ రామానాయుడు అన్నారు. శనివారం రాత్రి రాక్వుడ్స్ పాఠశాల 19వ వార్షికోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో సీఈఓ సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మకూర్లో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు



అమరచింతలో..

పోలియో చుక్కలు తప్పనిసరి



పెద్దమందడిలో ఇటుక బట్టీల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూర్: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కృషి చేయాలని, ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని తిప్పడంపల్లి పీహెచ్సీ వైద్యాధికారి శరత్కుమార్ అన్నారు. ఆదివారం పల్స్పోలియో కార్యక్రమం చేపట్టారు. రెండురోజులపాటు కొనసాగనున్న ఈకార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని, పీహెచ్సీ పరిధిలో 5,257 మంది చిన్నారులు ఉన్నారని, మొత్తం 43 బూత్లు, రెండు ట్రాన్సిస్, మొబైల్ టీంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 4, 5వ తేదీల్లో చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సురేష్కుమార్, హెల్త్ సూపర్వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

అమరచింత: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు అందిచడం ద్వారా అది వారికి దివ్యౌషధంలా మారి పోలియో రాకుండా కాపాడుతుందని మున్సిపల్ చైర్పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ గోపి అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన పోలియో బూత్ వద్ద చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలను అందించారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలాల్లో ఆదివారం చిన్నారులకు మండల వైద్య బృందాలచే పోలియో చుక్కలు పంపిణీ చేశారు.

గోపాల్పేట: ఉమ్మడి గోపాల్పేట మండలంలో ఆదివారం డాక్టర్లు, సిబ్బంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. అంగన్వాడీ సెంటర్లు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 33 సెంటర్లలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 5,128 మంది పిల్లలు ఉండగా 5,075 మంది పోలియో చుక్కలు వేశామని సూపర్వైజర్ సుచిత్ర తెలిపారు.

4,897 మందికి..

వీపనగండ్ల: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్పోలియో కార్యక్రమంలో 4,897 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలంలో పోలియో చుక్కలు వేసేందుకు 33 పోలింగ్ బూత్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మదనాపురం: మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, కొన్నూరు, నెలివిడి తదితర గ్రామాల్లో పోలియో చుక్కలను వేశారు. డాక్టర్ భవాని ఆధ్వర్యంలో హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండు చుక్కలతో పోలియోను తరిమేద్దాం

కొత్తకోట రూరల్: 5ఏళ్ల లోపు పిల్లలకు రెండు పోలియో చుక్కలను వేయించి పోలియోను తరిమేద్దామని అప్పరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంక అన్నారు. ఆదివారం ఉదయం అప్పరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12కేంద్రాల్లో పోలియో చుక్కలను వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 1,947మంది చిన్నారులకు గానూ 1,865మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేసి 96శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 27 కేంద్రాల్లో 4,728మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేసి పీహెచ్సీ పరిధిలో 97శాతం పూర్తి చేసినట్లు డాక్టర్ అసియాబేగం తెలిపారు.

పెద్దమందడి మండలంలో..

పెద్దమందడి మండలంలో 26 పోలియో కేంద్రాల్లో మొబైల్ టీంల ద్వారా 4,088 మంది చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ వేసినట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పరిమళ తెలిపారు. ఇటుక బట్టీల వద్ద చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ సాయిప్రసాద్, సూపర్వైజర్ ఓంప్రకాష్ తెలిపారు.



గోపాల్పేటలో..



వీపనగండ్లలో..



అప్పరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో..

ముగిసిన రాజావళి దర్గా ఉర్సు



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలో ఖాదర్గోరి, దేవరి మల్లప్ప

అమరచింత: పట్టణంలో మూడురోజుల పాటు కొనసాగిన సయ్యద్షా రాజవళీ దర్గా ఉర్సు ఆదివారం ముగిసింది. చివరిరోజు ఖత్మేఖురాన్ కార్యక్రమంతో దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. మహబూబ్నగర్ బృందం ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించింది. ఆదివారం ఆలిండియా కృష్ణ, మహేష్బాబు అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఖాదర్గోరి, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఖాదర్ ఘోరి మాట్లాడుతూ.. 15 ఏళ్ల కిందట దర్గాను దర్శించుకున్నానని.. అప్పటి నుంచి తన వ్యాపారం అభివృద్ధి పథంలో కొనసాగుతుండటంతో ఏటా అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రహరీ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీఇచ్చారు. అంతేగాకుండా ఏటా తమ ట్రస్టు ద్వారా రెండు పేద జంటల వివాహానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప మాట్లాడుతూ.. దర్గా అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖాజామైనుద్దీన్, అన్సారి, రఫీక్, ఇంతియాజ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పచ్చదనం.. ఆహ్లాదం

- మొక్కలతో కళ కళలాడుతున్న పల్లె ప్రకృతి వనాలు
- పట్టణాల్లో పార్కులకు దీటుగా ఏర్పాటు
- దాతల సహకారంతో మరిన్ని వసతులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం పట్టణాలలోని పార్కులకు దీటుగా పల్లెల్లో సైతం పల్లె ప్రకృతి వనాల పేరుతో మినీ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ నిధులు, దాతల సహకారంతో పల్లె ప్రకృతి వనాలు గ్రామాల్లో ఆహ్లాదకరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రకృతి వనాలు వివిధ రకాల పూల, పండ్ల మొక్కలతో పాటు అందమైన మొక్కలతో కళకళలాడుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో 124 పంచాయతీలు ఉండగా, దాదాపు 118 జీపీల్లో పనులు మొత్తం పూర్తి అయ్యాయి. మిగిలిన జీపీల్లో పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను బట్టి రూ.2లక్షల నుంచి రూ.6లక్షల వ్యయంతో ఎకర, అర ఎకర, పది గుంటల స్థలంలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకర స్థలంలో 4వేల మొక్కలు పెంచుతున్నారు. అందులో టేకు, పండ్లు, పూలు, ఔషధ మొక్కలతో పాటు 40 రకాల చిన్న, పెద్ద రకం మొక్కలను నాటి పెంచుతున్నారు. గ్రామ పంచాయతీ నిధులతో చుట్టూ ఇనుప కంచె ఫినిషింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలకు నిత్యం పంచాయతీ వనమాలి ద్వారా నీటిని అందిస్తున్నారు. దీంతో ఆయా జీపీలలో మొక్కలు ఇప్పటికే ఏపుగా పెరగడంతో ప్రకృతి వనాలు పచ్చదనంతో పల్లెలు పులకరించేలా అందంగా, ఆహ్లాదకరంగా కనబడుతున్నాయి. పార్కులో ఉదయం సాయంత్రం వేళల్లో యువకుల, వృద్ధులు సేద తీరేందుకు వీలుగా దాతల సహకారంతో పలు వసతులు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం ప్రకృతి వనాలకు వెళ్లడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు నూతన ఉత్సాహం కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని హంగులతో..

ప్రకృతి వనాల్లో గ్రామస్తులు సేదతీరడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లలు ఆటలు ఆడేందుకు క్రీడా సామగ్రిని దాతల సహకారంతో సమకూర్చుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో గ్రామస్తులు వాకింగ్ చేసేందుకు అందమైన రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ ప్రహరీలు ప్రజలను ఆకట్టుకునేలా రంగులతో పెయింటింగ్స్ వేశారు. ప్రకృతి వనాలలో పనులను స్థానిక, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పార్కులను ప్రభుత్వ నిధులతో పాటు దాతలు సహకారంతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణాలకు దీటుగా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోదండాపురంలోని పల్లె ప్రకృతివనం



ప్రకృతివనంలోని వివిధ రకాల మొక్కలు

మండలాల వారీగా పల్లె ప్రకృతి వనాలు		
మండలం	పంచాయతీలు	పూర్తయినవి
ఇటిక్యాల	29	29
మానవపాడు	16	16
ఉండవెల్లి	16	16
అలంపూర్	14	14
రాజోళి	11	11
వడ్డేపల్లి	10	10
అయిజ	28	28



గోపల్దిన్నె ప్రకృతివనంలో రోడ్లు

40రకాల మొక్కలు నాటాం..



మా గ్రామ పంచాయతీలో ఎకర ప్రభుత్వ స్థలంలో పల్లె ప్రకృతి వనం ఎంతో అపురూపంగా ఏర్పాటు చేశాం. అందులో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 40 రకాల మొక్కలు నాటి పెంచుతున్నా. పంచాయతీ నిధుల నుంచి ప్రకృతి వనం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి జీపీ సిబ్బంది ద్వారా నిత్యం మొక్కలకు నీటిని అందిస్తున్నాం. ప్రభుత్వం మారుమూల ప్రాంతాలలో కూడా గ్రామీణ పా ర్కులను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం. దాతలు ముందుకొస్తే చిన్నారులు, వృద్ధుల కోసం మరిన్ని అదనపు వసతులు కల్పిస్తా.

– రాజేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కోదండాపురం

వనాలు నిర్మించాం..



మండలంలోని 29 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు నిర్మించాం. ఎకర స్థలంలో నాలుగు వేల మొక్కల చొప్పున సుమారు 40 రకాల మొక్కలను నాటి సంరక్షిస్తున్నాం. మూడేళ్ల వరకు మొక్కలకు నీరు అందించేందుకు ప్రతి వనానికి వనమాలిని ఏర్పాటు చేశాం. ప్రకృతి వనాల్లో అక్కడక్కడ చిన్నచిన్న పనులుండగా, త్వరలోనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇవి అందుబాటులోకి వస్తే గ్రామస్తులకు పార్కులు లేని లోటు తీరుతుంది.

– భాస్కర్, మండల పంచాయతీ అధికారి, ఇటిక్యాల

'కబ్జాలు చేసేతత్వం సీపీఎంకు లేదు'



మాట్లాడుతున్న సీపీఎం పార్టీ నాయకులు

అమరచింత: ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి వాటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకునే తత్వం సీపీఎం పార్టీకి లేదని పార్టీ మండల కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్.గోపి తెలిపారు. పట్టణానికి చెందిన గ్రామకంఠం స్థలాన్ని పార్టీ కబ్జా చేసిందని కొంతమంది పనిగట్టుకొని తమపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 1998 డిసెంబర్లో నారాయణపేట జిల్లా ధన్వాడ సమీపంలో రోడ్డు ప్రమాదంలో సీఐటీయూ నాయకుడు శ్రీనివాసులు మృతి చెందడంతో పట్టణంలో స్థూప నిర్మాణం చేశామన్నారు. ఇందుకు గ్రామ కంఠంలోని ఐదు గుంటల స్థలాన్ని అప్పటి సర్పంచ్ లలితమ్మ కేటాయించారన్నారు. అనంతరం జీఎస్ స్మారకార్థం జీఎస్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన స్థలంలో స్వచ్ఛంద సంస్థ పేరిట భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఇందుకు అప్పటి సర్పంచ్లు ఎల్.గోపాల్, టీ.గోపాల్, పురం వెంకటేశ్వర్ రెడ్డి ద్వారా స్థలాన్ని రెన్యూవల్ చేసుకుంటూ వచ్చామని, ప్రస్తుతం అదే ఆధారాలతో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వెల్లడించారు. దీన్ని జీర్ణించుకోలేని బీజేపీ నాయకులు తాము అక్రమంగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశామని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. పట్టణంలో సీపీఎం పార్టీ సర్పంచ్గా ఉన్నప్పుడు ప్రభుత్వ స్థలాలను అన్ని వర్గాల ప్రజలకు అందించామన్నారు. జీఎస్ స్వచ్ఛంద సంస్థ కోసం స్థూపం వెనకాల ఉన్న 20 గుంటల స్థలంలో బుడుకలి వారికోసం కమ్యూనిటీ హాల్, సామూహిక మరుగుదొడ్లు, మత్స్యకార్మిక భవనం కోసం వినియోగించేందుకు స్థలాన్ని ఇచ్చారని, మిగిలిన స్థలాన్ని తమ ట్రస్ట్కు ఇవ్వాలని కోరడంతో అనుమతి ఇచ్చారాన్నరు. పేదల పక్షాన పోరాటం చేస్తున్న సీపీఎంకు ప్రభుత్వ స్థలాలను ఎన్నటికి కబ్జా చేయదన్నారు. సమావేశంలో అజయ్, శ్యాంసుందర్, వెంకటేష్, రాజు, రఘు పలువురు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



తెల్లరాళ్లపల్లిలో సభ్యత్వ నమోదులో నాయకులు

పాన్గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్రెడ్డి, జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి అన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమాన్ని లాఠీలతో అణిచివేస్తూ, ఇద్దరు రైతుల మరణానికి కారణమైందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. పార్లమెంట్లో కనీస మద్దతు ధర చట్టాన్ని ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందక రైతుల పంటలు ఎండుముఖం పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. పంటలు ఎండిన రైతులకు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో జంబులయ్య, భీమయ్య, శివుడు, సాయిలు, శేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఓపెన్ కబడ్డీ పోటీల్లో విజేతలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ: మండల కేంద్రంలో తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొసాగుతున్నాయి. ఆదివారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్న ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. అలంపూర్ ఎమ్మెల్యే క్రీడలను తిలకించి, క్రీడాకారులను పరిచయం చే సుకున్నారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేసి క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఎమ్మెల్యే సూచించా రు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


ఓపెన్ కబడ్డీ పోటీల్లో విజేతలు

మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించిన ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్లో విజేతలను ఆలయ కమిటీ ప్రకటించింది. కర్నూలు జిల్లా ప్యాపిలికి చెందిన జట్టు మొదటి బహుమతి రూ.30 వేలు కైవసం చేసుకుంది. కర్నూలు జిల్లా స్టేడియం టీం 2వ బహుమతి రూ.20 వేలు, జోగుళాంబ గద్వాల జిల్లా తనగలకు చెందిన టీం 3వ బహుమతి రూ.10 వేలు, జోగుళాంబ గద్వాల జిల్లా పులికల్కు చెందిన టీం 4వ బహుమతి రూ.5 వేలు గెలుచుకుంది. విజేతలకు బహుమతులు అందజేశారు.

7 నుంచి షటిల్ పోటీలు

వనపర్తిటౌన్: ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు సిల్వర్ జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి పురుషుల షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెంట్ సత్యశీలారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పోటీలను సిల్వర్ జూబ్లీక్లబ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9666349900, 7095851811 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమాజ నిర్మాణానికి నడుం బిగించాలి



మహబూబ్నగర్ మున్సిపాలిటీ: నవసమాజ నిర్మాణానికి మహిళలు నడుం బిగించాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందంజ వేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఎన్నో చట్టాలు రూపొందించినా వారిపై అక్కడక్కడా అఘాయిత్యాలు, అత్యాచారాలకు కొందరు పాల్పడటం తగదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, మల్లికార్జున్, వినోద్కుమార్, రాజసింహుడు, నాగశ్రీ, సరస్వతి, శివపార్వతి, శశిరేఖ, రేణుకాదేవి, ఊర్మిళ, రేణుక పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను ఆదుకోవాలి



స్టేషన్ మహబూబ్నగర్: రాష్ట్రంలోని మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం బ్యాంకులతో లింకేజీ లేకుండా 100 శాతం సబ్సిడీ రుణాలు అందజేసి ఆదుకోవాలని ఆల్మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్గా నియామకమైన ఒబేదుల్లా కొత్వాల్ను ఆదివారం ఆయన నివాసంలో ఆల్మేవా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వహీద్షా, కోశాధికారి ఎండీ.రషీద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.ఇఫ్తఖ్అలీ, మహ్మద్ అయూబ్, యూసుఫ్ బిన్ నాసర్ పాల్గొన్నారు.